

పులివెందులలో దుండగుల హల్ చల్

పులివెందుల పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీ–2లో శుక్రవారం రాత్రి కొందరు దుండగులు హల్ చల్ చేశారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. -8లో



కూటమి ప్రభుత్వంలో యువతకు అన్యాయం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.1/26.4

వాతావరణం

జిల్లాలో శనివారం 26.4 - 38.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 13.96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్



కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో యోగాసనాలు చేస్తున్న జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు

ఆరోగ్యమే మహా భాగ్యం




యోగా చేస్తున్న మహిళ

కడప ఎడ్యుకేషన్: మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే.. ప్రతి కుటుంబానికి ఆరోగ్య సౌభాగ్యం సిద్ధించడంతో పాటు.. మానసిక వికాసం మన సొంతం అవుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యాఖ్యానించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో యోగాంధ్ర మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కడప నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యోగా'కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కడప స్టేడియం చైర్మన్ శ్రావణ్ రాజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ యోగా కార్యక్రమానికి వేలాది మంది హాజరై యోగాసనాలు వేయడం శుభపరిణామం అన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎస్పీ అశోక్ కుమార్ ప్రసంగించారు. సుమారు 5 వేల మంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు రగ్బీ జిల్లా జట్టు ఎంపిక



కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి కడప జిల్లాలో ఆదివారం జూనియర్ బాల బాలికల రగ్బీ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ వి. ధన నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28–29న 18 ఇయర్స్ కేటగిరి కి సంబంధించిన బాల బాలికల రగ్బీ ఇంటర్ జిల్లాల టోర్నమెంట్ కర్నూలులో జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లా జట్టు కోసం ఎంపికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలు కడప మునిసిపల్ స్టేడియంలో జరుగుతాయన్నారు. వివరాలకు 8297059998ను సంప్రదించాలని సూచించారు.

అన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాత రామాంజనేయుల రెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన కుప్పన గారి సంజీవరెడ్డి కుమారుడు రామాంజనేయులరెడ్డి విరాళం ఇచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరి,రాజారమేష్,మాజీ చైర్మెన్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

చట్టమా.. చుట్టమా!

- చట్టాలను ఉల్లంఘిస్తున్న కార్పొరేషన్ అధికారులు
- హెచ్‌ఓడీల నుంచి కమిషనర్ వరకు జీహెచ్ఎంసీ యాక్ట్ ఉల్లంఘన
- కమిషనర్, ఏడీ సీ, ఎస్ఈలను సరెండర్ చేస్తూ పాలకమండలి తీర్మాణం
- హెచ్‌ఓడీలకు షోకాజ్ నోటీసు జారీ
- అధికార పార్టీ మెప్పు కోసం తప్పులో కాలేస్తున్న అధికారులు



మున్సిపల్ కార్యాలయంలో మేయర్ కుర్చీకి సమానంగా ఎక్స్ అఫీషియో సభ్యులకు ఏర్పాటు చేసిన కుర్చీలు

సాక్షి ప్రతినిధి, కడప: అధికారులు హద్దులు మీరుతున్నారు. చుట్టాల మాయలో పడి చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాల్సింది పోయి.. అధికార పార్టీ నేతల ముందు సాగిలపడుతున్నారు. ప్రజలకు మేలు చేసే కుర్చీలో ఉండి.. నేతల కుర్చీ కోసం పరితపించిపోతున్నారు. అధికార పార్టీ మెప్పు కోసం తప్పుల మీద తప్పులు చేస్తున్నారు. కడప నగరపాలక సంస్థ అధికారుల పని తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఉద్యోగులు విధి నిర్వహణలో చట్టాన్ని అనుసరించాలి. నిబద్ధతతో స్థానిక సంస్థల ప్రతినిధులకు తోడు–నీడగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నిక కాబడిన నేతలకు బాసటగా ఉంటూ చట్టానికి లోబడి దిశా–నిర్దేశం చేయాలి. అవన్నీ మరిచి.. అధికార పార్టీకి చెందిన వారే అసలైన ప్రజా ప్రతినిధులు, విపక్షపార్టీలకు చెందిన వారు ప్రజా ప్రతినిధులు కాలేరంటూ కడప నగర పాలక సంస్థలో కొత్త భాష్యాన్ని తెరపైకి తెస్తున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ, హక్కులను కాలరాస్తున్న సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు ముక్త కంఠంతో కోరుతున్నారు. విధి ధర్మాన్ని పాటించలేక ఉన్నతాధికారి ఒత్తిడికి తలొగ్గిన కొందరు అధికారుల పరిస్థితి ప్రస్తుతం డోలాయమానంగా మారింది.

- మున్సిపల్ కార్పొరేషన్ యాక్టు–88 కార్పొరేటర్లు, మేయర్ హక్కులకు అండగా నిలుస్తోంది. మేయర్ సూచించిన రోజు, నిర్ణయించిన సమయానికి, నిర్దేశించిన ప్రదేశంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించాలని స్పష్టం చేస్తోంది. ఆ చట్టాన్ని కార్పొరేషన్ కమిషనర్, ఏడీసీ, ఎస్ఈ, ఆయా శాఖల హెచ్‌ఓడీలు విస్మరించారు. ఒకటికి రెండు సార్లు కార్పొరేటర్ నుంచి మేయర్ వరకూ పదుల సంఖ్యలో వాట్సప్ ద్వారా, టపాలా ద్వారా కమిషనర్‌కు సమావేశానికి హాజరు కావాలని కోరారు. కమిషనర్‌తో పాటు, ఇతర అధికారులు కూడా కాన్ఫరెన్సు హాల్ వద్ద సమావేశంలో పాల్గొనాలని నిర్ణయించారు. పాలకవర్గం నిర్ణయాలను అధికారులు పూర్తిగా విస్మరించారు. పైగా కాన్ఫరెన్సు హాల్‌లో సమావేశం నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు సైతం జారీ చేసింది. మేయర్ విచక్షణతో నిమిత్తం లేకుండా ఎక్స్‌అఫిషియో సభ్యులకు మేయర్ స్థాయిలో సమాంతరంగా సీట్లు ఏర్పాటు చేశారు. అన్ని రకాలుగా చట్టాన్ని ఉల్లంఘిస్తూ వచ్చిన సదరు అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నామని నగరపాలక సభ్యులు జీహెచ్ఎంసీ యాక్టు 104 అనుసరించి కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ఏడీసీ రాకేష్‌చంద్ర, ఎస్ఈ చెన్నకేశవరెడ్డిలపై ఏకగ్రీవంగా శుక్రవారం తీర్మాణం చేశారు. కార్పొరేషన్‌కు మేయర్ ప్రథమ పౌరుడు, పాలకమండలి సంస్థకు సుప్రీం అయినప్పటికీ అధికార పార్టీపై ఉన్న మోజు, ఆ పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు డోలాయమానంలో పడ్డారు.

షోకాజ్ నోటీసులు జారీ చేసిన మేయర్

మున్సిపల్ యాక్టు ఉల్లంఘిస్తూ, మేయర్ హక్కులను కాలరాస్తూ, హైకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించిన కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, సిటీ ప్లానర్ వెంకటరమణ, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్యలకు మేయర్ సురేష్‌బాబు శనివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. 39మంది కార్పొరేటర్లు హాజరై సమావేశానికి రావాలని కోరినా, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. జీహెచ్ఎంసీ యాక్టు ఉల్లంఘించిన ఆ ఏడుగురు వారం రోజుల్లో రాతపూర్వక వివరణ ఇవ్వాలని మేయర్ సురేష్‌బాబు షోకాజ్ నోటీసు ద్వారా ఆదేశించారు. ఆయా అధికారులకు కోర్టు ధిక్కారణ యాక్టు 1975 కూడా వర్తించనున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మెప్పు కోసం కమిషనర్ మనోజ్‌రెడ్డి స్టేజీపై కుర్చీ వేయడం, చట్టాన్ని ఉల్లంఘించడం, కమిషనర్‌ను అనుసరించిన అధికారులు ఇప్పుడు మదనపడుతున్నట్లు సమాచారం. హైకోర్టులో కేసు ఫైల్ చేస్తే వచ్చే ఇబ్బందులు పసిగట్టిన అధికారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. కమిషనర్ తప్పు చేసి అధికారులందర్నీ తప్పుదారిలో పయనించేలా చేశారని పేరు వెల్లడించేందుకు ఇష్టపడని అధికారులు వాపోతున్నారు.

స్వచ్ఛ జిల్లాగా 'వైఎస్ఆర్ కడప'

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



స్వచ్ఛ దివస్‌లో భాగంగా కలెక్టర్, ఎస్పీలతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో.. భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత స్వచ్ఛ జిల్లాగా తీర్చి దిద్దుతామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ 'స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛ దివస్‌లో భాగంగా మొక్కలు నాటించారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ , ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లు పిలుపునిచ్చారు. ఈగల్ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను అతిథులతో కలిసి ఆవిష్కరించారు.

జీవన ప్రయాణం!



పులివెందులలో ఆటో నడుపుతున్న లక్ష్మీదేవమ్మ

ఆమె తోడుంటే.. కష్టాలు సైతం ఇష్టాలవుతాయి.. ఆమె చేయూతనిస్తే... సంసార సాగరమైన పిల్ల కాలువలా మారిపోతుంది. ఆమె వెన్నంటి నిలిస్తే.. అతడి బతుకు పంట పండుతుంది. ఆమె..తన కుటుంబం కోసం వంటింట్లో గరిట పడుతుంది... అవసరమొస్తే.. ఇలా ఆటో స్టీరింగూ చేతిలోకి తీసుకుంటుంది.

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈమె పేరు లక్ష్మీదేవమ్మ. పులివెందుల పట్టణంలోని జెండామాను వీధి సమీపంలో తూర్పు ఆంజనేయస్వామి గుడి వద్ద నివాసముంటోంది. పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పులయ్యాయి... ఆపై భర్త జగన్ అనారోగ్యం కారణంతో ఆ అప్పులు రెండింతలయ్యాయి.. చూస్తుండగానే కుటుంబ పోషణ భారమైంది. భర్త సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. అంతే.. భర్తకు తోడుగా నిలవాలని నిర్ణయించుకుంది.. డ్రైవింగ్ నేర్చుకుంది. భర్తతో పాటు తను కూడా ఇదిగో ఇలా ఆటో నడుపుతూ బతుకుబండిని లాగుతోంది. అన్ని ఖర్చులుపోను ప్రతిరోజు ఐదారు వందలు సంపాదిస్తోంది. భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ పోషణకు తనవంతు సహకారం అందించేందుకే ఆటో స్టీరింగ్ పట్టుకోవాల్సి వచ్చిందని చెబుతోంది. ఉదయం 9 గంటలకల్లా ఇంట్లో పనులు ముగించుకొని ఆటో బయటకు తీసే లక్ష్మీ దేవమ్మ.. సాయంత్రం 7 వరకు అలుపెరగకుండా ఆటో నడుపుతూ తన జీవన ప్రయాణాన్ని ముందుకు సాగిస్తోంది. ఆమె గురించి తెలుసుకున్నవారు 'శభాష్ .. దేవమ్మ'అంటూ కొనియాడుతున్నారు. ప్రభుత్వం ఆమెకు చేయూతనివ్వాలని సూచిస్తున్నారు.–పులివెందుల రూరల్

25న ప్రవేశ పరీక్ష

కడప రూరల్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈనెల 25న పరీక్షలు నిర్వహించనున్నట్లు చిన్నచౌక్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. 6 నుంచి 9వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 23 వరకు స్వీకరిస్తామని తెలిపారు. 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

తొలి రోజు కౌన్సెలింగ్ ప్రశాంతం



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. తొలిరోజు శనివారం జిల్లావ్యాప్తంగా 1వ ర్యాంకు నుంచి 15 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 110 మంది అభ్యర్థులు తమ కౌన్సెలింగ్‌లో ధృవ పత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ దామోదర్, వెరిఫికేషన్ ఆఫీసర్లు అనిత, బాగ్యశ్రీ, రేణుకాలతోపాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

నేడు నిర్వహించబోయే కౌన్సిలింగ్ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 15001 నుంచి 32 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు తమ పత్రాలను ధ్రువీకరించుకోవాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని తీవ్ర గాయాలు

ముద్దనూరు : స్థానిక కొత్త బస్టాండు సమీపంలో శనివారం టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పవన్‌కుమార్ రెడ్డి అనే వ్యక్తి కడప రహదారిలో వెళ్తుండగా కొత్త బస్టాండు వైపు నుంచి వస్తున్న ఓ టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో పవన్‌కు కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స కోసం క్షతగాత్రుడిని ప్రొద్దుటూరుకు తరలించారు.

మద్యం మత్తులో వీరంగం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో శనివారం దువ్వూరు మండలం కృష్ణంపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. అక్కడున్న మహిళను దూషించడంతో రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన ఓబుళమ్మ అనే మహిళ అతన్ని పట్టుకొని దేహశుద్ధి చేసింది. స్థానికులు వారించడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో వైరల్ కావడంతో త్రీటౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు.

వేధింపులపై కేసు నమోదు

ముద్దనూరు : భర్త, అత్తమామలు తనను మానసికంగా, శారీకంగా వేధింపులకు గురిచేస్తున్నారని వాసంతి అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన వాసంతికి ఐదేళ్ల క్రితం మైలవరం మండలం దొమ్మరనంద్యాలకు చెందిన శరత్‌తో వివాహమైంది. గత కొంతకాలం నుంచి శరత్, అతని తల్లితండ్రులు వేధింపులకు గురిచేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. దీంతో విసుగు చెందిన వాసంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ చిన్నబిడికి సమీపంలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.27,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో యువతకు అన్యాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి
- ఈనెల 23న యువత పోరు ర్యాలీ
- అనుమతి కోసం జిల్లా ఎస్పీకి వినతిపత్రం


జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి, విద్యార్థి, యువజన సంఘాల నేతలు

కడప అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం యువతతో పాటు, విద్యార్థులకు సకాలంలో పథకాలను వర్తింపచేయకుండా దగా చేస్తోందని, ఈ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 23న కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి 'యువతపోరు' పేరుతో ర్యాలీగా కలెక్టరేట్‌కు బయలుదేరి కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పోలీసుల అనుమతి కోసం శనివారం కడపలోని జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన, విద్యార్థి విభాగాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే యువతతోపాటు, రైతులకు, మహిళలకు అన్ని వర్గాలకు మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని, లేదంటే ప్రతినెలా రూ. 3000 నిరుద్యోగ భృతిని అందజేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే 'యువతపోరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 'అమ్మ ఒడి' పథకానికి 'తల్లికి వందనం' అనే పేరు మార్చి ఏడాది తరువాత ఇటీవల ఎంత మంది తల్లుల బ్యాంకు ఖాతాలలో రూ. 15000 చొప్పున వేశారో అంచనాకు రాలేదన్నారు. ఎవరెవరికి, ఏయే షరతులను విధించి ఆ పథకానికి దూరం చేశారో తేలాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతమంది విద్యార్థులకు వర్తింపచేశారో కూడా తెలియాల్సి ఉందన్నారు. గత ఏడాది కాలం నుంచి ఫీజు రీ యింబర్స్‌మెంట్‌లో భాగంగా విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తింపచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి రాకముందు తల్లికి వందనం ఎలాంటి షరతులు లేకుండా అందరికి వర్తింపజేస్తామని, ఎంతమంది పిల్లలుంటే వారందరికి పథకం వర్తింపజేస్తామని 'బాబు ష్యూరిటీ' పేరుతో హామీలను ఇచ్చారని, సూపర్ సిక్స్‌లో ఏ పథకం సక్రమంగా అమలు చేయకపోయినా 'చొక్కా పట్టుకుని నిలదీయండి' అని చెప్పారన్నారు. తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, విద్యాకానుక లాంటి పథకాలను చంద్రబాబు అమలు చేయకపోవడంతో 13 నెలల్లోనే దాదాపు రూ.22వేల కోట్లు లబ్ధిదారులకు బకాయిలు పడ్డారన్నారు. ఈ పథకాలను అమలు చేసేంత వరకు తాము పోరాడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షఫీవుల్లా, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్ రంగంపై అవగాహన అవసరం


స్పేస్ ల్యాబ్ ప్రారంభిస్తున్న దృశ్యం

చాపాడు : విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు శాటిలైట్ రంగంపై అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం ఆయా పాఠశాలలు చర్యలు తీసుకోవాలని ఇస్రో ప్రాజెక్టు మాజీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ టీకే సుందరమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పేస్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఆయన ముందు చూపునకు నిదర్శనమన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాల ద్వారా మాత్రమే జ్ఞానం పొందలేరని ప్రయోగశాల ద్వారా నేర్చుకున్న విద్య ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కడపలోని జిల్లా కోర్టు న్యాయసేవాసదన్‌లో యోగా సాధన కార్యక్రమం

- కడప నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు


యోగా ఆంగ్ల అక్షరాల్లో విద్యార్థులు

కడప అర్బన్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కడప నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గరికపాటి దీనబాబు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో న్యాయమూర్తులు, న్యాయశాఖ అధికారులు, ఉద్యోగులు యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. యోగ అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, మనుషులలో ఉన్న ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, వారిని నిరాశ, నిస్పృహల నుంచా బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందన్నారు. యోగాలోని ఒక్కో ప్రక్రియ వల్ల ఒక్కో ఫలితం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మిత్ర యోగా కేంద్రం నిర్వాహకులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగుల చేత యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎస్.శాంతి, కె.ప్రత్యూష కుమారి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ జి సి. ఆసిఫా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రేష్మ పాల్గొన్నారు.

బీసీసీపీఎల్ ఆధ్వర్యంలో..

కమలాపురం : ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు యోగా చేయాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీసీసీపీఎల్‌లోని డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో పలు రకాల యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా అనే ఆంగ్ల అక్షరాల్లో ఐమిడి కనువిందు చేశారు. సీఎంఓ మాట్లాడుతూ భారతి డీఏవీ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా తదితర వాటిలో రాణించడం హర్షణీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వారంలో కనీసం రెండు రోజులైనా నిర్వహించాలని ఆయన ప్రిన్సిపల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్


వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వన్‌టౌన్ సీఐ జి. రామకృష్ణ, ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి

కడప అర్బన్ : రోడ్డు భద్రతపై ప్రతి శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బైక్‌లు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, అతి వేగం, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నకిలీ బంగారుతో బ్యాంకులకు బురిడీ


రాయచోటి : నకిలీ బంగారు ఆభరణాలను చూపి బ్యాంకులను బురిడీ కొట్టించి లక్షల రూపాయల రుణాలను పొందిన సంఘటన రాయచోటిలో వెలుగు చూసింది. మూడు పర్యాయాలు నకిలీ బంగారు పెట్టి రూ.11 లక్షల రుణాలు పొందిన వ్యక్తి నాలుగో పర్యాయం మిత్రునితో కలిసి శుక్రవారం బ్యాంకులో రుణం పొందే ప్రయత్నం బెడిసి కొట్టింది. రాయచోటి పోలీసుల వివరాల మేరకు.. రాయచోటికి చెందిన షేక్ హైదర్ అలీ మూడు సంవత్సరాల క్రితం రాయచోటిలోని కరూర్ వైశ్యా బ్యాంకులో బ్యాంకు సిబ్బందిని మోసగించి 74.4 గ్రాముల నకిలీ బంగారాన్ని అప్పగించి రూ 2.5 లక్షల రుణాన్ని పొందాడు. అలాగే పట్టణంలోని నేతాజీ సర్కిల్, సుండుపల్లి రోడ్డు మార్గాలలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లలో నకిలీ బంగారు ఆభరణాలను పెట్టి రెండేళ్ల క్రితం ఎనిమిది లక్షల రూపాయల రుణాలను పొందాడు. కరూర్ వైశ్యా బ్యాంకులో మూడేళ్ల క్రితం పెట్టిన బంగారు రుణం రెన్యువల్ చేయించుకోవాలని ఇటీవల నోటీసులు ఇచ్చారు. ఇదే సమయంలో హైదర్ అలీ ఈనెల 20వ తేదీ శుక్రవారం తన మిత్రుడు రియాజ్ ద్వారా నకిలీ బంగారంతో కరూర్ వైశ్యా బ్యాంకులో రుణం పొందే ప్రయత్నం చేశాడు. రుణం కోసం తెచ్చిన బంగారు ఆభరణాలు నకిలీవని తేలడంతో సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బ్యాంకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో గతంలో హైదర్ అలీ పెట్టిన బంగారు నగలు నకిలీవని సమాచారం ఇవ్వడంతో మూడు బ్యాంకుల్లో దాచిన బంగారు నగలను పరిశీలించారు. బ్యాంక్ అధికారులు హైదర్ అలీ, రియాజ్‌లపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఇరువురిపై 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ బీవీ చలపతి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ కొని యువకుడి మృతి


మృతి చెందిన గంగాధర్

మైదుకూరు : రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైదుకూరు మండలం చెర్లోపల్లె సమీపంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం లక్కిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దొడ్డి పద్మావతి తన కుమారుడు గంగాధర్ (20)తో కలసి చెర్లోపల్లెలో ఉన్న ఆమె చెల్లెలు గుర్రమ్మ ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి చాపాడు మండలం నాగులపల్లె గ్రామంలో గుర్రమ్మ కుమార్తె సీమంతానికి హాజరయ్యేందుకు మోటార్ బైక్‌పై తల్లి కొడుకు బయల్దేరారు. చెర్లోపల్లె సమీపంలో వీరి బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న గంగాధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని తల్లి పద్మావతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో ఛిద్రమైన మృతదేహం

వల్లూరు : కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో విమానాశ్రయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లూరు మండల పరిధిలోని పుల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన బి.భాస్కర్ రెడ్డి (38) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పుల్లారెడ్డిపేటకు చెందిన భాస్కర్ రెడ్డి భార్య చెవి సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని కడపలోని ఓ ఆసుపత్రిలో ఉన్నారు. భార్య వద్దకు వెళ్లేందుకు భాస్కర్‌రెడ్డి తన కుమారుడు ప్రణీత్ రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో కడపకు బయలు దేరాడు. విమానాశ్రయం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో కిందపడ్డ భాస్కర్‌రెడ్డిపై ట్యాంకర్ ఎక్కడంతో అతని శరీరం ఛిద్రంగా మారి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు ప్రణీత్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాలుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది


రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలో మామిడి రైతులకు కల్గిన ఇబ్బందులు ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఆకస్మికంగా రైల్వేకోడూరులో పర్యటించి మామిడి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులతో మాట్లాడి అనంతరం శెట్టిగుంటలోని జ్యూస్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాజంపేట పరిధిలో 2630 హెక్టార్లలో తోతాపూరి మామిడి రకాన్ని రైతులు సాగు చేస్తున్నారని, వీటిలో 22 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందన్నారు. కచ్చితంగా ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ. 4లు సబ్సిడీ అందిస్తామని పేర్కొన్నారు

యువకుడి ఆత్మహత్య

తంబళ్లపల్లె : మానసిక పరిస్థితి సరిగా లేక ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని మర్రిమాకుపల్లెకు చెందిన బాలకృష్ణమనాయుని కుమారుడు భూపతి నాయుడుకు (30) మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ సమీపంలోని బోరు వద్దకు వెళ్లి కానుగచెట్టుకు ఉరి వేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తండ్రి బోరువద్దకు వెళ్లగా అప్పటికే మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారై దుర్వాసన వస్తోంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

సిద్దవటం రేంజిలో కూంబింగ్

సిద్దవటం : సిద్దవటం రేంజి పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు ఫారెస్టు రేంజి పరిధిలోని గొల్లపల్లె బీటు, సిద్దవటం బీటు, రోళ్లబోడు బీట్లలోని సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి కూబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచా రం ఇవ్వాలన్నారు. ఈ కూంబింగ్‌లో డీఆర్ఓ ఓబులేసు, బీటు అధికారులు, అసిస్టెంటు బీటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపిక


వైష్ణవి


రిషిత

నందలూరు : అండర్-19 బాలికల విభాగంలో సీఏవైడీ కడప జిల్లా క్రికెట్ జట్టుకు రాజంపేటకు చెందిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని మోహన వైష్ణవి బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా, రిషిత మీడియం ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫిరోజ్ ఖాన్ లోడీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు అమ్మాయిలు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపిక య్యేలా శిక్షణ ఇచ్చిన ట్రైనర్ శివకోటి, పీఈటీ రాహుల్, కోచ్‌లు, సీఏవైడీ ప్రెసిడెంట్ భరత్‌రెడ్డి, సెక్రటరీ రెడ్డిప్రసాద్, డీసీఓ ఖాజామైనుద్దీన్, ఉమెన్ క్రికెట్ కోఆర్డినేటర్ విష్ణుమోహన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న కంటైనర్


రోడ్డుపై అడ్డంగా బోల్తాపడిన కంటైనర్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ సమీపంలో కడప-చెన్నై జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు చెన్నై నుంచి కడప వైపు వెళ్తున్న కంటైనర్ మంటపంపల్లి సమీపంలోకి రాగానే రాజంపేట వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.

పులివెందులలో దుండగుల హల్‌చల్


పెద్దకొండప్ప కాలనీలో అర్ధరాత్రి సంచరిస్తున్న యువకుడు

పులివెందుల రూరల్ : పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీ-2లో శుక్రవారం రాత్రి కొందరు దుండగులు హల్ చల్ చేశారు. అర్ధరాత్రి వీధిలోకి ప్రవేశించిన దుండగులు ఇళ్ల ముందు పార్కు చేసి ఉన్న దాదాపు 10 ద్విచక్ర వాహనాలను కింద పడవేసి.. కొన్నింటిని పగులగొట్టి వెళ్లారు. ఉదయాన్నే కాలనీ వాసులు రాత్రి జరిగిన సంఘటనను చూసి భయభ్రాంతులయ్యారు. వీరు కాలనీలో వీధి వెంట దర్జాగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇటీవల ఏదో ఒక ప్రాంతంలో చిన్న చిన్న చోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులివెందుల పట్టణంలో చాలామంది యువత గంజాయి, మద్యానికి అలవాటుపడి డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ చర్యకు పాల్పడింది ఆకతాయిలా.. లేక దొంగలా అనేది తేలాల్సి ఉంది. పోలీసులు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పుత్తూరు సిద్ధార్థలో గ్రాడ్యుయేషన్ డే



యువ ఇంజినీర్‌కు స్వర్ణ పతకం అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం : పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వా గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించేందుకు సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ స్థాయి ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇంకుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేశామన్నారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతలో రాజీ పడకుండా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చాన్సలర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీ పడి సృజనాత్మక, ఇన్నోవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువ ఇంజినీర్లు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నామినీస్ ప్రశాంతి, అరుణక్రాంతి, ప్రిన్సిపాల్ మధు, జనార్దనరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ విజయభాస్కర్, గోపి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ నాయకుడు షేక్ అన్సర్ మృతి


షేక్ అన్సర్(ఫైల్)

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ గల్ఫ్ సభ్యుడు, ఎన్ఆర్ఐ షేక్ అన్సర్ బాషా(65) శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. కడప నగరం సాయిబాబా హాల్ సమీపంలోని నాయక్‌సాబ్ వీధి(అ డైగర)లో నివాసమున్న అన్సర్ బాషా జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కువైట్‌లో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ బాలిరెడ్డిలతో కలిసి కువైట్ కమిటీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్సర్ లేని లోటు తీర్చలేనిదన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం సంతాపం

షేక్ అన్సర్ బాషా మృతి పట్ల మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అన్సర్ తనకు పెద్దన్నలాంటివారని, ఆయన మృతి తనకు వ్యక్తిగతంగాను, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

- ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


మామిడి రైతుల సమస్యసలు వింటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : మామిడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు శనివారం మామిడిని సాగు చేసే రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎంతో నష్టపోయామని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కూడా రైతులకు అండగా ఉంటూ అక్కున చేర్చుకున్నారని కొనియాడారు.